# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దావోస్ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ కు పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **తెలంగాణలో అమలు కానున్న సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ రోజు సంబంధిత శాఖల మంత్రులతో చర్చించనున్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో వసతి గృహాల మరమ్మతుల కోసం ప్రభుత్వం 143 కోట్ల రూపాయలను విడుదల చేసిందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.**
4. **హైదరాబాద్ లో అత్యాధునిక సౌకర్యాతో భవిష్యత్తు నగరాన్ని నిర్మించనున్నామని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి వెల్లడించారు.**
5. **ఈరోజు 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

దావోస్ పర్యటనలో ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకొన్న ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో పాటు ఇతర ముఖ్య అధికారులతో సమావేశమయ్యారు. మూడు రోజులపాటు దావోస్‌లో ఆయా కంపెనీల ఛైర్మన్లు, సీఈవోలు, ప్రతినిధులతో జరిపిన చర్చల సారాంశాన్ని వారికి వివరించారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు సాధించేందుకు దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో జరిపిన చర్చలు కార్యరూపం దాల్చేలా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

-------------------------

తెలంగాణలో రేపటి నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర పథకాలు అమలు కానున్న నేపథ్యంలో.. వీటిపై సమగ్రంగా చర్చించేందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ రోజు సంబంధిత శాఖల మంత్రులతో సమావేశమవుతారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ సమావేశం జరగనుంది. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అనుసరించాల్సిన విధానాలపై చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరో వైపు 4 పథకాలకు లబ్ధిదారుల ధ్రువీకరణ, కొత్త దరఖాస్తుల స్వీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు నిన్నటితో ముగిశాయి. ఈ నెల 21 నుంచి మొదలైన కార్యక్రమం నాలుగు రోజులపాటు జరిగింది. నాలుగు రోజుల్లో మొత్తం 12 వేల 861 గ్రామసభలు, 3 వేల

487 వార్డుసభల చొప్పున మొత్తం 16 వేల 348 సభలు నిర్వహించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

---------------------------

తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు నిన్న కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కలిసి ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జరిగిన సభలో బండి సంజయ్ మాట్లాడుతూ, తెలంగాణకు గత పదేళ్ళలో కేంద్ర ప్రభుత్వం 12 లక్షల కోట్ల రూపాయలను ఇచ్చిందని చెప్పారు. 32 జిల్లాల్లోనూ జాతీయరహదారులను అభివృద్ధి చేశామన్నారు. త్వరలోనే కరంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 143 కోట్ల రూపాయలను విడుదల చేసిందని ఆ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. బాపట్ల జిల్లా పర్యటనలో భాగంగా చీరాలలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని గత రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో సౌకర్యాలు, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 2 వందల కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం పైన ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆర్థిక సంవత్సరం 2022-23 కి సంబంధించి దేశంలోని రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య డేటాను 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ నిన్న విడుదల చేశారు. రెవెన్యూ సమీకరణ, ఖర్చులు, అప్పులు, చెల్లింపు సామర్థ్యం వంటి అంశాలపై నీతి ఆయోగ్ అధ్యయనం చేసింది. ఈ మేరకు 2022-23 ఆర్థిక సంవత్సరం నివేదికను విడుదల చేసింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ 17వ స్థానంలో ఉండగా.. తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది. పంజాబ్ మినహా మిగతా రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య స్థితి మెరుగుగా ఉందని ఆర్థిక సంఘం తెలిపింది.

---------------------------

ఈరోజు 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1950 జనవరి 25వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అయితే, కేంద్ర ఎన్నికల సంఘం 2011 జనవరి 25 నుండి ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఓటు హక్కు లేని వారిని, ఓటు వేయడానికి అర్హత పొందిన యువతీయువకులను కొత్త ఓటర్ల జాబితాలోకి చేర్చడం, ప్రస్తుత ఓటర్ల జాబితాలోని లోపాలను సరిదిద్దడం వంటి కార్యక్రమాలను ఈరోజు నిర్వహిస్తున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు సాయంత్రం 4 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమలలో రథసప్తమి పండుగను పురస్కరించుకొని ఫిబ్రవరి 4వ తేదీన వీఐపీ విరామ దర్శనాలను రద్దు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె. శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం.. తిరుమల మాడవీధుల్లో ఏర్పాట్లను ఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ,

వాయిస్ ( 29 సెకన్లు)

---------------------------

హైదరాబాద్‌లో అత్యాధునిక సౌకర్యాతో భవిష్యత్తు నగరాన్ని నిర్మించనున్నామని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, ఏ దేశమైనా, ఏ నగరమైన ఆధునికమైన మౌలిక వసతులు ఉంటేనే ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు అవసరాల కోసం రీజనల్ రింగ్ రోడ్డు- ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం చేయనున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా వివరించారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర ప్రాంతాల్లో మంచు కురుస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, విజయవాడ నగర పరిసరాలలో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంది. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై హెడ్‌లైట్ల వెలుగులో వాహనాలు నెమ్మదిగా వెళ్తున్నాయి. కూడళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులకు పోలీసులు సూచిస్తున్నారు.

---------------------------

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన కోసం ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సభ్యకార్యదర్శి యం. బబిత తెలిపారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ, హైకోర్టు న్యాయసేవల కమిటీ ఛైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. రఘునందన్‌రావు హాజరవుతారని వెల్లడించారు.

======================